సాక్షి
జనగామ
మంగళవారం | 16 | మే | 2023



విద్యార్థులు బడిబయట ఉండొద్దు

ఐటీడీఏ పరిధిలోని గ్రామాల్లో చదువుకునే విద్యార్థులు బడిబయట ఉండొద్దని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు.

- 8లో▸



రైతులను మోసం చేస్తే పీడీయాక్ట్

వ్యవసాయదారులను మోసానికి గురిచేస్తే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$41^0/28^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం వేడిగాలులు వీస్తాయి. ఉక్కపోత రాత్రి వరకు ఉంటుంది. వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు పాటించాలి.

న్యూస్‌రీల్

క్రీడలతో ఏకాగ్రత పెరుగుతుంది

● కలెక్టర్ శివలింగయ్య



పాలకుర్తి: క్రీడలతో మానసిక శారీరక దారుఢ్యంతోపాటు, ఏకాగ్రత పెరుగుతుందని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. సోమవారం పాలకుర్తిలో సీఎం కప్ క్రీడలను కలెక్టర్ శివలింగయ్య ప్రారంభించారు. విద్యార్థులు, యువతను ప్రోత్సాహించడం కోసం క్రీడలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. క్రీడల్లో ప్రావీణ్యం పెంచుకున్న వారికి ఉద్యోగ అవకాశం ఉంటుందని అన్నారు. ప్రారంభానికి ముందు కలెక్టర్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాసరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మదార్, సీఐ విశ్వేశ్వర్, తహసీల్దార్ పాల్‌సింగ్, ఎంపీడీఓ అశోక్‌కుమార్, నోడల్ అధికారి యాకయ్య, సర్పంచ్ వీరమనేని యాకయ్య, పీఈటీలు శ్రీనివాస్, అశోక్, యాదగిరి తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల బాలురలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి ఇస్మాయిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యాథ్స్, ఇంగ్లిష్, జువాలజీలో ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. సంబంధిత సబ్జెక్ట్‌లో డిగ్రీలో 50శాతం మార్కులు ఉండాలని బీఎడ్ ఉత్తీర్ణత సాధించడంతోపాటు 44 ఏళ్ల వయస్సు ఉండి బోధనలో 3ఏళ్ల అనుభవం ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులు నేటి నుంచి 24వ తేది సాయంత్రం 4.30 గంటలలోపు కలెక్టర్ కార్యాలయంలోని ఎఫ్ 25రూం నంబర్‌లో అందజేయాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 96036 28326, 99519 33034 ఫోన్ నంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

రైతులపై ప్రభుత్వ నిర్లక్ష్యం సరికాదు



జనగామ రూరల్: ఐకేపీ సెంటర్‌లో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి విడనాడాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాసాన్‌పల్లి లింగాజీ అన్నారు. సోమవారం రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు సంకటి అన్వేష్‌రెడ్డి పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ శివలింగయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షానికి పంటల నష్ట పరిహారం పొందేందుకు ఎలాంటి పైరవీలు లేకుండా పారదర్శకంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. మిల్లర్లు రైతుల వద్ద ఐకేపీ, పీఏసీఎస్‌ల ద్వారా కొనుగోలు చేస్తున్న ధాన్యంలో క్వింటాకు 1 నుంచి 10 కిలోల తరుగు తీసేయడం దారుణమన్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, చింతకింది మల్లేష్, మహిళ అధ్యక్షురాలు బడికే ఇందిర, ప్రవీన్, శ్యాంసుందర్, రాజీరెడ్డి పాల్గొన్నారు.

మకర తోరణం బహూకరణ



పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో లక్ష్మీనర్సింహస్వామికి వెండి మకర తోరణాన్ని సోమవారం మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన భక్తుడు బొబ్బల రమణారెడ్డి, రమాదేవి దంపతులు బహూకరించారు. ఈ సందర్భంగా భక్తుడు బొబ్బల రమణారెడ్డి మాట్లాడుతూ.. సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి తమ ఇంటి ఇలవేల్పు అని గతంలో స్వామివారిని దర్శంచుకొని లక్ష్మీనరసింహస్వామికి వెండి మకర తోరణం చేయిస్తానని మొక్కుకున్నానని, కోరిక నెరవేరడంతో రూ.2.50,000తో మూడు కేజీల వెండితో మరర తోరణాన్ని తయారు చేయించినట్లు చెప్పారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ సమక్షంలో ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్నకి భక్తుడి సోదరుడు పాలకుర్తి సోసైటీ చైర్మన్ బొబ్బల అశోక్‌రెడ్డి, లక్ష్మీ దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జెడ్పీటీసీ పుస్కూరి శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ కుమార్, ఆలయ పర్యవేక్షకుడు కొత్తపల్లి వెంకటయ్య, అర్చకుడు దేవగిరి లక్ష్మన్న, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

భూ సమస్యలే అధికం..

● గ్రీవెన్స్‌కు వెల్లువెత్తిన దరఖాస్తులు
● సమస్యలు సత్వరమే పరిష్కరించాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ రూరల్: సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు ప్రజలు వివిధ సమస్యలతో తరలివచ్చారు. అయితే వీరిలో ఎక్కువగా భూసమస్యలతోపాటు, దివ్యాంగులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ శివలింగయ్య అధికారులతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలపై అందిన ఫిర్యాదులు పరిశీలించి సత్వరం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందులో తహసీల్దార్ పరిధికి అత్యధికంగా 30 దరఖాస్తులు రాగా, మున్సిపల్‌కు 4, పోలీస్ శాఖకు 4, లాంగ్ రికార్డ్స్ 2, వ్యవసాయ శాఖ 1, సివిల్ సప్లయీస్ 1, ఎంప్లాయ్‌మెంట్ 1, డీపీఓ 1, డీఆర్‌డీఓ 2, లీగల్ కౌన్సిల్ 2, ఎంపీడీఓ 1, ఎస్సీ వెల్ఫేర్ 1, లేబర్ 1, ఇర్రిగేషన్ 1 చొప్పున వినతులు వచ్చాయని అధికారులు తెలిపారు.

త్రీవీలర్ స్కూటీ ఇచ్చి ఆదుకోవాలి



లింగాల ఘనపురం మండలం కుందారం గ్రామానికి చెందిన పాలమాకుల యాదగిరి ఏడేళ్ల కిందట రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. దీంతో తన కుడి కాలు రెండు చోట్ల విరిగింది. స్టాండ్‌తో బయటికి వెళ్లే పరిస్థితి. తనకు దివ్యాంగుల కోటా కింద త్రీవీలర్ స్కూటీ ఇవ్వాలని వినతి అందజేశాడు.

వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేశా..



చిల్పూరు మండలంలోని పల్లగుట్టకు చెందిన చిదురాల రాజేశ్వరీ భర్త 4 ఏళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. ఇద్దరు పిల్లలు ఉన్నారు. వితంతు పింఛన్ కోసం రెండేళ్ల కిందట ఆన్‌లైన్‌లో ధరాఖాస్తు చేసుకుంది. గ్రామంలో అందరికీ పింఛన్ రాగా తనకు ఇంత వరకు రాలేదని కలెక్టర్‌కు వినతి అందజేసింది.

నాకూతురు భూమిని పట్టా చేసుకొని వెళ్లగొట్టింది



చిల్పూరు మండలం వెంకటాద్రిపేటకు చెందిన ఆవుల వెంకటయ్యకు సర్వే నంబర్ 51లో 2.30 ఎకరాల భూమి ఉంది. నాలుగేళ్ల క్రితం భార్య అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో కూతురు వద్ద ఉంటూ కాలం వెల్లదీస్తుండగా తన భూమిని కూతురు అల్లుడు అక్రమంగా పట్టా చేసుకున్నారు. భూమిపైకి రాకుండా ఇంటి నుంచి వెళ్లగొట్టారని తనకు న్యాయం జరిపించి తన భూమిని తన పేర చేయాలని కలెక్టర్‌ను వేడుకున్నాడు.

ఖరీదు చేస్తేనే భూమి ఇస్తాడట..



తరిగొప్పుల మండంలోని అక్కరాజుపల్లికి చెందిన బోల్లు రామయ్య అదే గ్రామానికి చెందిన కమ్మరి వెంకటయ్య వద్ద 1968లో ఎకరం 18 గుంటల భూమిని కొనుగోలు చేశారు. అప్పటి నుంచి ఖాస్తు మీద ఉంటూ.. 4 ఏళ్ల క్రితం మృతి చెందాడు. ఈ క్రమంలో సర్వే నంబర్ తప్పుగా పడి గ్రామానికి చెందిన మరో వ్యక్తి పేరు మీద పట్టా అయింది. ఇప్పుడు భూమి ఖరీదు ఇస్తేనే పట్టా చేస్తానని బెదిరిస్తున్నాడని తమకు న్యాయం చేయాలని రామయ్య కుమారుడు రామచంద్రం కోరాడు.



ఉపాధి డబ్బులు లేవంటున్నారు



జనగామ మండలంలోని పెద్ద తండా(ఎం) రమావత్ వెంకటేష్‌తోపాటు, ఉపాధీ కూలీలకు పనిచేసిన డబ్బులు రాలేదు. మే 2022లో, ఏప్రిల్ 2023లో పెద్ద తండా (ఎం) పరిధిలో హనుమాన్ గుడి నుంచి, టాక్యతండా వరకు లాండ్ లెవలింగ్ పనులు చేపట్టగా ఇందులోని 108 మందికి ఒక వారం డబ్బులు, 98 మందికి మరో వారం డబ్బులు రాలేదు. ఇదే విషయంలో వర్క్ ఐడీలు చూపించి వివరాలు అడగ్గా స్థానిక ఏపీఓ భిక్షపతి పొంతలేని సమాధానం చెపుతూ.. ఇష్టం వచ్చిన చోట ఫిర్యాదు చేసుకోమని దురుసుగా ప్రవర్తించాడని.. వెంటనే చర్యలు తీసుకుని కూలీల డబ్బులు వచ్చేలా చూడాలని వినతి పత్రం అందజేశాడు.

పాముల బెడద తీర్చండి



జనగామ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలోని 20వ వార్డులో సైడ్ కాలువ అసంపూర్తి ఉండడం.. కాల్వ కింది భాగంలో బెడ్ నాణ్యతలేనందున కాలువలో గుంతలు ఏర్పడి నీరు నిలుస్తుంది. చెత్త చెదారం పేరుకుపోగా.. పాములు, క్రిమి కీటకాలు వస్తున్నాయి. రాత్రి వేళల్లో ఇంట్లోకి పాములు వస్తు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని చిన్నపిల్లలు బయటి రాలేని పరిస్థితి ఉందని కాలనీ వాసులు సోమవారం కలెక్టర్‌కు వినతి అందజేశారు.

మట్టి అక్రమ రవాణా ఆపాలి



రఘునాథపల్లి మండలంలో గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు అక్రమంగా చెరువు మట్టిని ఏళ్ల తరబడి అక్రమంగా వెంచర్లకు తరలిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తొలగిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు వెంకటేష్, రాష్ట్ర నాయకులు కేవీఎల్ఎన్ రెడ్డి వినతి అందజేశారు.

కుష్ఠు రహిత సమాజమే లక్ష్యం

● రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ జాన్ బాబు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర టీం సభ్యులు

నర్మెట: కుష్ఠువ్యాధి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం కావాలని ఆదిశగా అందరూ కృషి చేయాలని రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ జాన్ బాబు పిలుపునిచ్చారు. రాష్ట్ర, జిల్లా సభ్యులతో కలసి స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సోమవారం సందర్శించిన ఆయన సంబంధిత రికార్డులు, రిపోర్టులను పరిశీలించి వ్యాధిగ్రస్తుల వివరాలు తెలుసుకుని సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వ్యాధి లక్షణాలు ప్రాథమిక దశలో గుర్తించి మల్టీడ్రగ్‌థెరపీ విధానంలో నయం చేయవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ విధానం అందుబాటులో ఉందని తెలిపారు. కుష్ఠు వ్యాధిగ్రస్తులపై వివక్ష పనికిరాదని వ్యాధినిర్మూలనకు కలసికట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రోగ్రామింగ్ అధికారి సంతోషిలత, జిల్లా అధికారి లగిశెట్టి అశోక్ కుమార్, ఏపీఎంఓలు లోకేందర్, నర్సింహారెడ్డి, లూర్థ్, అరుణ, అసిస్టెంట్స్ దేవిక, సకలా రెడ్డి, మండల వైద్యాధికారి రవితేజ, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సోమన్న ఆలయంలో భక్తుల సందడి



స్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

పాలకుర్తి టౌన్: శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడిగా నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వేసవి సెలువులు కావడంతో భక్తులతో ఆలయం పొటెత్తింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకండా ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.

జనగామకు వరం మెడికల్ కళాశాల

● ఆగస్టు, సెప్టెంబర్‌లో అడ్మిషన్ల ప్రక్రియ
● క్రిటికల్ కేర్ ఆస్పత్రి పనుల పరిశీలన
● అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి



ఆస్పత్రి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ: జనగామ జిల్లాకు మెడికల్ కళాశాల వరంగా మారిందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. చంపక్‌హిల్స్ మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్రం పక్కన రూ.23.75 కోట్లతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ ఆస్పత్రి, మెడికల్ కళాశాల తరగతుల నిర్వహణ కోసం తలపెట్టిన తాత్కాలిక భవన నిర్మాణ పనులను సోమవారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి పరిశీలించి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతం అక్కడే ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెడికల్ కళాశాల విషయంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంతో పాటు రూ.190 కోట్ల బడ్జెట్ సైతం మంజూరు చేశారన్నారు. తెలంగాణకు ఒక్క మెడికల్ కళాశాల తీసుకురాని చేతగాని బీజేపీ దద్దమ్మలు రాష్ట్రాన్ని దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతున్న సీఎం కేసీఆర్‌పై పిచ్చిగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అయితే ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు లో మెడికల్ కళాశాల మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభిస్తారన్నారని ఎమ్మెల్యే అన్నారు. ఒప్పుడు ఎంబీబీఎస్ చదవాలంటే సప్తసముద్రాలు దాటే పరిస్థితి ఉంటే, ప్రత్యేక రాష్ట్రంలో కేసీఆర్ అధికారం చేపట్టిన తర్వాత గణనీయంగా సీట్లు పెరిగి, సామాన్యులు సైతం ఇక్కడే చదువుకునే అవకాశం లభించిందన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవాలనే ఉద్దేశంతో ఓర్వలేని బీజేపీ ప్రభుత్వం, మనకు ఒక్క రూపాయి కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. రాబోయే సాధారణ ఎన్నికల్లో బీఆర్ఎస్ రాష్ట్రంలో మూడో సారి జెండా ఎగుర వేయబోతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంతో పాటు కేసీఆర్ నాయకత్వంలో దేశ రాజకీయాల్లో పెను ప్రభంజనం సృష్టించి. ఢిల్లీ ఎర్ర కోటపై సైతం గులాబీ జెండాను ఎగుర వేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోపాల్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, ఎంపీపీ మేకల కళింగ రాజు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్‌రాజు, ఇంజినీర్లు దేవేంద్రకుమార్, రాజశేఖర్, నాయకులు యాదగిరిగౌడ్, రాజు, సందీప్ ఉన్నారు.

మిల్లర్లతో కుమ్మక్కై దగా చేస్తున్నారు

● పురుగుల మందు డబ్బాతో విశ్వనాథపురంలో రైతుల రాస్తారోకో



రోడ్డుపై ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు



పురుగులమందు డబ్బాతో నిరసన తెలుపుతున్న రైతులు

స్టేషన్‌ఘన్‌పూర్: రైస్ మిల్లర్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, అధికారులు కుమ్మక్కై అన్నదాతల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపిస్తూ మండలంలోని విశ్వనాథపురం క్రాస్ వద్ద ఘన్‌పూర్‌- పాలకుర్తి రోడ్డుపై రైతులు సోమవారం ధాన్యానికి నిప్పు పెట్టి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, మిల్లర్లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేపట్టారు. తూకంలో బస్తాకు 41 కిలోల 200 గ్రాములు వేస్తుండగా, మిల్లర్లు అదనంగా బస్తాకు కిలో తరుగు తీస్తామనడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సెంటర్ ఇన్‌చార్జ్‌తో వాగ్వాదం చేశారు. కొనుగోలు కేంద్రంలో బస్తాలు లోడ్ చేసిన లారీని వెళ్లకుండా అడ్డుకుని ఆందోళనకు దిగారు. తరుగు, ఔటర్ పేరుతో రైతులను నిలువునా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ రైతు దాసి లక్ష్మణ్ పురుగుల మందు డబ్బా చేతిలో పట్టుకుని నిరసన తెలిపారు. నెలరోజులైనా ధాన్యం కాంటా కావడం లేదని, కుంటిసాకులతో జాప్యం చేస్తున్నారని క్రిమిసంహారక మందు తాగే ప్రయత్నం చేశారు. అనంతరం విశ్వనాథపురం, చంద్రుతండా రైతులు ధాన్యం బస్తాలతో విశ్వనాథపురం ఎక్స్‌రోడ్డు వద్ద రోడ్డెక్కారు. ఘన్‌పూర్‌-పాలకుర్తి రోడ్డుపై ధాన్యం పోసి నిప్పటించి నిరసన తెలిపారు. రైతుల రాస్తారోకోకు టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చేపూరి వినోద్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు అక్కిరెడ్డి సంపత్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి పూంద్రు నవీన్‌రెడ్డి, అక్కిరెడ్డి సాగర్‌రెడ్డి తదితరులు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా చేపూరి వినోద్, రైతులు భూక్య బిక్కమ్మ, భూక్య విజయ, విమల, సుగుణ మాట్లాడారు. తక్షణమే జిల్లా మంత్రి, కలెక్టర్ స్పందించి నిబంధనల ప్రకారం బస్తాకు 41 కిలోల చొప్పున మిల్లర్లు అనుమతించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. ఆందోళన విషయం తెలుసుకున్న ఎస్సై శ్రావణ్‌కుమార్ పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చచెప్పి రాస్తారోకోను విరమించారు. రైతులు భూక్య బుజ్జి, రాజు, రామన్, సంపత్, బిక్కు, సుమన్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపుపై కలెక్టర్ ఆగ్రహం

● విచారణకు ఆదేశం
● పరిశీలించిన తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్..



చెరువులో పరిశీలిస్తున్న తహసీల్దార్ రవీందర్

జనగామ రూరల్: మండలంలోని చీటకోడూర్ రామప్పకుంట చెరువులో మట్టి అక్రమ తరలింపుపై సాక్షి కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. సంబంధిత వివరాలు తీసుకోవాలని తహల్దార్‌ను ఆదేశించారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ చెరువును పరిశీలించారు. చెరువులోని మట్టి అనుమతి పత్రాలు చూపాలని తహసీల్దార్ కోరగా.. సంబంధిత కాంట్రాక్టర్ పొంతన లేని సమాధానం చెప్పడంతో ఆగ్రహించారు. అనుమతి పత్రాలు చూపించే వరకు ఎలాంటి పనులు చేయకూడదని ఆదేశించారు. అనుమపతి పత్రాలు డీఈ వద్ద ఉన్నాయని తెలపడంతో నేడు విచారణ చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. అయితే గతంలో చెక్ డ్యాం సైడు కోతకు గురికాగా కట్టపై మట్టి పోసి మరమ్మతులు, నూతనంగా నిర్మించిన కట్టపై మట్టి పోస్తున్నారు. గతంలో జరిగిన వాటికి ఉచితంగా సదరు కాంట్రాక్టర్ పనులు చేపడుతున్నారా.. లేక బిల్లులు పెట్టుకోవడానికా అని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైలుకు ఎదురు వెళ్లి..

● ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యయత్నం చేసిన యాసిన్

జనగామ: మద్యం మత్తులో ఓ ప్రభుత్వ ఉద్యోగి రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన సంఘటన జనగామ జిల్లా కేంద్రం చిన్నమోరీ సమీపంలో సోమవారం జరిగింది. జనగామ రైల్వే అవుట్ పోస్టు ఇన్‌చార్జ్ హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి, జీఆర్‌పీ కానిస్టేబుల్ నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన ఎండీ.యాసిన్(47)కు జనగామ పట్టణం గుండ్లకు చెందిన మహిళతో వివాహం అయింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భువనగిరి ఆర్‌అండ్‌బీ శాఖలో జూనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వర్తిస్తున్న యాసిన్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఎనిమిదేళ్లుగా నుంచి భార్యా భర్తలు వేర్వేరుగా ఉంటున్నారు. అయితే అనుకోకుండా కొన్ని సమయాల్లో అత్తగారింటి వద్ద ప్రత్యక్షమవుతూ.. గొడవ చేస్తూ ఇబ్బందులకు గురిచేసేవాడని చెప్పారు. ఇదే క్రమంలో ఎనిమిది నెలలుగా డ్యూటీకి సైతం వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్న యాసిన్.. జనగామకు వచ్చి సికింద్రాబాద్ వెళ్తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌కు చిన్నిమోరీ ఏరియాలో అడ్డు వెళ్లగా రైలు ఢీకొని ఓ చేయి, కాలు పూర్తిగా ఎగిరి పోయి.. తీవ్ర గాయాల పాలై ట్రాక్ మధ్యలో పడిపోయాడు. స్థానికులు వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్య పరీక్షల కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించారు.

ఫ్లైఓవర్‌పై ఘోర ప్రమాదం

● రెయిలింగ్‌ను ఢీకొట్టి.. బైక్‌పైకి దూసుకొచ్చి పల్టీ కొట్టిన కారు
● ఇద్దరు ద్విచక్రవాహనదారుల పరిస్థితి విషమం
● బ్రిడ్జి కింద పరుగులు పెట్టిన జనం



కారు ఢీకొట్టడంతో కూలిన రెయిలింగ్



గాయాలపాలైన విక్రమ్, సారయ్య

జనగామ: జనగామ ఫ్లైఓవర్‌పై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ద్విచక్రవాహనదారుల పరిస్థితి విషమంగా మారగా.. బ్రిడ్జి కింద ఉన్న జనం పరుగులు పెట్టి ప్రాణాలను కాపాడుకున్నారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగంతో ఫ్లైఓవర్ రెయిలింగ్ సైతం కూలిపోయింది. కారు రెయిలింగ్‌ను ఢీ కొడుతూ తిరిగి వెనక్కి వచ్చి రోడ్డుపై పల్టీ కొట్టడంతో తృటిలో పెను ప్రమాదం తప్పింది. ఫ్లైఓవర్‌పై కారు ప్రమాదానికి సంబంధించి ప్రత్యక్ష సాక్షి చోటు, ఇతరులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బీరప్పగడ్డకు చెందిన నేలపోగుల విక్రమ్(21), ఆరెళ్ల సారయ్య(19) ఇద్దరు స్నేహితులు. విక్రమ్ సెలూన్ షాపు, సారయ్య డెకరేట్ పని చేసుకుంటున్నారు. ఇద్దరు స్నేహితులు గోకుల్‌నగర్ వైపు వెళ్లి బైక్‌పై నెహ్రూ పార్కుకు బయలు దేరారు. ఫ్లైఓవర్ మధ్యకు వచ్చే సరికి టీఆర్ నంబర్‌తో ఉన్న ఓ కారు వేగంగా చక్కర్లు కొడుతూ రెయిలింగ్‌కు ఢీకొట్టి.. బైక్‌ను తాకింది. రెయిలింగ్ కూలి సిమెంటు దిమ్మెలు కింద పడిపోగా.. కారు బిడ్జిపై పల్టీ కొట్టింది. బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు ఎగిరిపడడంతో తలతో పాటు శరీర భాగాలకు తీవ్రగాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావం జరిగి అపస్మారక స్థితిలో ఉన్న యువకులను స్థానికులు జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. సారయ్యకు ఫిడ్స్ రావడంతో సీటీ స్కాన్ కోసం దవాఖానలో అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు సెంటర్‌కు రెఫర్ చేశారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు రెఫర్ చేస్తామని డాక్టర్లు చెప్పారు.

ఒకేచోట మూడు సార్లు..

ఫ్లైఓవర్‌పై ఒకేచోట ఇప్పటి వరకు మూడుసార్లు ప్రమాదాలు జరిగాయి. ఏడాదిన్నర క్రితం పశుగ్రాసం లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ రేయిలింగ్‌కు ఢీకొట్టగా.. మరోసారి ద్విచక్రవాహనం.. ఇప్పుడు కారు ప్రమాదంతో ఫ్లైఓవర్ కింద నివాసం, ఇతర పనులు చేసుకుంటున్న వారు వణికిపోతున్నారు. కారు రెయిలింగ్‌కు ఢీకొట్టిన సమయంలో ఫ్లైఓవర్ కింద ఉన్న సుమారు పదిమంది పరుగులు తీసి ప్రాణాలు కాపాడుకున్నారు. ఎస్సై సృజన్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాడ్మింటన్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రమేష్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ పింగిళి రమేష్ రెడ్డి ఎన్నికైనట్లు అసోసియేషన్ వరంగల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి పుల్లెల గోపీచంద్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన వార్షిక జనరల్ బాడీ సమావేశం అనంతరం జరిగిన ఎన్నికల్లో రమేష్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ పదవిలో నాలుగేళ్లపాటు రమేష్‌రెడ్డి కొనసాగనున్నారు. జితేందర్‌రెడ్డి, నాగకిషన్, కొమ్ము రాజేందర్, కిశోర్, భాస్కర్, కృష్ణవేణి, హన్మంతరావు, శ్యాంకుమార్, ప్రసాద్, శ్రీధర్, శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు.

రైతులను మోసం చేస్తే పీడీయాక్ట్

● సీపీ ఏవీ రంగనాథ్



వివరాలు వెల్లడిస్తున్న కాజీపేట ఏసీపీ

వరంగల్ క్రైం: వ్యవసాయదారులను మోసానికి గురిచేసే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. కరీంనగర్ జిల్లా వీణవంకు చెందిన రవిశెట్టి రవిబాబు వరంగల్, కరీంనగర్ జిల్లాలోని రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి వారికి ఇవ్వాల్సిన డబ్బుల ఎగవేతకు పాల్పడినందుకు నిందితుడిపై వరంగల్ కమిషనరేట్ పరిధిలో తొలిసారిగా సీపీ పీడీయాక్ట్ ఉత్తర్వులను జారీ చేశారు. సీపీ జారీ చేసిన పీడీయాక్టు ఉత్తర్వులను కాజీపేట ఏసీపీ శ్రీనివాస్ సోమవారం కాజీపేట ఏసీపీ కార్యాలయంలో అందజేసి నిందితుడిని చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నిందితుడు రవిబాబు వరంగల్, కరీంనగర్ జిల్లాలో సుమారు 6 టన్నుల వరి ధాన్యంను కొనుగోలు చేసి రైతులకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా రూ.కోటిన్నర చెల్లించకుండా ఎగవేతలకు పాల్పడ్డాడు. వ్యవసాయదారులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్కతుర్తి, ముల్కనూర్, వరంగల్ పోలీస్ స్టేషన్లలో నిందితుడిపై కేసులు నమోదు కావడంతో నిందితుడిపై పీడీయాక్టు ఉత్తర్వులను జారీ అయినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్‌కుమార్, ముల్కనూర్ ఎస్సై మహేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు బడిబయట ఉండొద్దు

గ్రామాల్లో డప్పు చాటింపు వేయించండి

● నూరుశాతం ప్రవేశాలు జరగాలి
● ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం : స్థానిక ఐటీడీఏ పరిధిలోని గ్రామాల్లో చదువుకునే విద్యార్థులు బడిబయట ఉండొద్దని, గొత్తికోయ, గిరిజన గూడేలు, తండాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఎడ్యుకేషన్ అధికారులు డప్పు చాటింపు వేయించి విద్యార్థులను బడిలో చేర్పించేందుకు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో సెక్టార్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ రీజియన్‌లోని ఇంటర్మీడియట్, టెస్ట్‌పరీక్షలు సబ్జెక్టులు, ఫ్యాకల్టీ వారీగా ఫలితాలను ఏకీకృతం చేయాలని ఆర్‌సీఓ వెంకటేష్‌ను ఆదేశించారు.

- ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజన సంక్షేమ సంస్థలు, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు, ఆశ్రమ పాఠశాలల్లో 3 నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రవేశానికి సంబంధించి అన్ని ఆవాసాలు, గ్రామాల్లోని టాంటాం చేయించాలని డీడీని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీఓ అంకిత్

- ఎంఎస్ఎంఈ కార్యక్రమం కింద హార్టికల్చర్, కూరగాయలు, పండ్ల పెంపకం, సరఫరా యూనిట్‌ను ఏర్పాటు చేయడానికి ఆసక్తిగల జాయింట్ లయబిలిటీ గ్రూప్‌లను గుర్తించాలని, వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికను సిద్ధం చేయాలని పీహెచ్ఓ రమణను కోరారు.
- ఇప్పటికే భూగర్భజల శాఖ ద్వారా తవ్విన బోరుబావుల కోసం మోటారు, విద్యుత్ కనెక్షన్ల మంజూరు కోసం వస్తున్న లబ్ధిదారుల జాబితాను ఏకీకృతం చేసి ఐటీడీఏ స్థాయిలో చర్యలు తీసుకోవాలని పీఏఓను కోరారు.
- ఆవాసాల్లో నీటి సరఫరా ఏర్పాట్లపై ఏవైనా సమస్యలపై డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మిషన్ భగీరథను ఆరా తీయగా, మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఎటువంటి సమస్య లేదని డీఈ నివేదించారు.



హాజరైన ఐటీడీఏ సెక్టార్ అధికారులు

- పోస్ట్‌మెట్రిక్ హాస్టల్ ఆరేపల్లిలో కోచింగ్ క్యాంప్ నిర్వహించడం కోసం గ్రూప్-3, 4 కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను స్క్రీనింగ్ టెస్ట్‌ల ద్వారా ఎంపిక చేసి గుర్తించాలని వరంగల్ ఏసీఎంఓను కోరారు.
- సీఎం కప్ 2023 మండల స్థాయి క్రీడల్లో ఎంతమంది పాల్గొంటున్నారని, పాల్గొనే వారికి భోజన ఏర్పాట్లపై ఏటూరునాగారం ఎంపీడీఓను ప్రశ్నించగా దాదాపు 500 మంది విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ఏటూరునాగారంలో నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ కుమార్ వివరించారు. మండల కేంద్రంలోని ఎస్టీ బాలుర హాస్టల్‌లో భోజన ఏర్పాట్లు చేశామన్నారు.
- మేడారం జాతర ప్రతిపాదనలు 2024 ఏకీకరణ స్థితిపై ఐటీడీఏ ఎస్ఓ రాజ్‌కుమార్‌ను ప్రశ్నించగా కొన్ని శాఖలు సమర్పించలేదని, రెండు రోజుల్లో ప్రతిపాదనలను సేకరించి ఏకీకృతం చేస్తామని వివరించారు.
- పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై సమీక్షించి వారం రోజుల్లో వాటిని అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. విధులపై నిర్లక్ష్యం చేసినా సమస్యలు పట్టించుకోకపోయినా వారికి శాఖపరమైన చర్యలుంటాయన్నారు. ఏపీఓ వసంతరావు, డీడీ పోచం, ఏఓ దామోదరస్వామి, ఎస్ఓ రాజ్‌కుమార్, పీహెచ్ఓ రమణ, పీఏఓ భారతి, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డి, ఆర్‌సీఓ వెంకన్న, తహసీల్దార్ లక్ష్మణ్, ఎంపీడీఓలు కుమార్, ఫణిచంద్ర, బాబు, డీఈఈ సతీష్, పెసా కోఆర్డినేటర్ ప్రభాకర్, జీడీఎం కొండల్‌రావు పాల్గొన్నారు.

మానుకోట జనరల్ ఆస్పత్రిలో బాలింత మృతి



భాగ్యలక్ష్మి

నెహ్రూసెంటర్ : మెరుగైన చికిత్స కోసం వచ్చిన ఓ బాలింత మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. మృతురాలి భర్త వద్దూరి వెంకటేష్ కథనం ప్రకారం ..జిల్లాలోని మరిపెడకు చెందిన వద్దూరి భాగ్యలక్ష్మి (23) రెండో కాన్పు కోసం వచ్చి మరిపెడ పీహెచ్‌సీలో మగశిశువుకు జన్మనిచ్చింది. ఉదయం 10.45 గంటలకు ప్రసవం జరిగిన కొంత సమయం నుంచి ఆమె మానసిక స్థితి సరిగాలేనట్లుగా ప్రవర్తించింది. విధుల్లో ఉన్న మరిపెడ పీహెచ్‌సీ డాక్టర్ రవి ఆమెకు చికిత్స అందించారు. సాయంత్రం 3 గంటల సమయంలో భాగ్యలక్ష్మి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లమని సూచించారు. మెరుగైన వైద్యం కోసం మానుకోటకు తీసుకురాగా పరీక్షించిన వైద్యులు వైద్య చికిత్స మొదలుపెట్టారు. కొంత సమయం పాటు ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఆమెకు ఆయాసం తగ్గకపోవడంతో వరంగల్‌కు తీసుకెళ్లమని సూచించారు. వెంటనే అంబులెన్స్ ఎక్కిస్తుండగా మృతి చెందింది. మరిపెడ వైద్యాధికారి నిర్లక్ష్యంతోనే తన భార్య మృతి చెందిందని వెంకటేష్ ఆరోపించాడు. జరిగిన సంఘటనపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరాడు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

● జీరో దందాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి
● జేడీఎంకు రైతు సంఘం ఫిర్యాదు



జేడీఎం మల్లేశంకు ఫిర్యాదు చేస్తున్న రైతు సంఘం నాయకులు

వరంగల్ : వరంగల్ ఏనుమాములలోని వ్యవసాయ మార్కెట్‌లో జరుగుతున్న అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, కార్యదర్శి ఓదెల రాజయ్య అన్నారు. సోమవారం మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు ఈ.మల్లేషంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే 2వ అతి పెద్ద వ్యవసాయ మార్కెట్‌గా గుర్తింపు పొందిందన్నారు. మార్కెట్‌కు రైతులు తమ పంటను అమ్ముకునేందుకు నల్గొండ, ఖమ్మం, కరీంనగర్‌లతో పాటు ఇతర రాష్ట్రాలనుంచి రైతులు పెద్ద సంఖ్యలో పత్తి, మిర్చి, అపరాలు తీసుకొస్తూ విక్రయాలు చేస్తారని అన్నారు. మధ్యవర్తి(అడ్తిదారులు)గా ఉన్న కొందరు వ్యాపారులు మార్కెట్ అధికారులతో కుమ్మక్కై వచ్చిన సరుకులను జీరోగా వైట్‌పేపర్లపై పట్టీలు పెడుతూ రోజు వచ్చే లక్షల రూపాయల ఆదాయాన్ని రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల మార్కెట్‌లో క్రిందిస్థాయి ఉద్యోగస్తులు వేధింపులకు గురవుతున్నట్లు, అక్రమాలు జరుగుతున్నట్లుగా ప్రింట్ మీడియాల్లో వార్తలు వస్తున్నాయన్నారు. ఉద్యోగులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల రైతులు నష్టపోతున్నారని తెలిపారు. మార్కెట్‌లో జరిగే అన్ని విషయాలపై సమగ్ర విచారణ జరిపి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మార్కెట్‌లో పనిచేసే ప్రతిఒక్కరూ రైతుల ప్రయోజనాలు కాపాడే విధంగా సమన్వయంతో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సిరుల రవీందర్, జెండా అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై నుంచి దూసుకెళ్లిన లారీ

● అక్కడికక్కడే కూలీ మృతి
● రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఆందోళన
● పోలీసులు నచ్చజెప్పడంతో విరమణ



క్వారీ వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల పంచాయతీ పరిధిలోని కుంట్లం-3 ఇసుక క్వారీ వద్ద వేసవి తాపంతో చెట్టునీడలో నిద్రిస్తున్న కూలీపై నుంచి లారీ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... పలుగుల గ్రామానికి చెందిన పసుల ఎర్రయ్య(55) ఇసుక క్వారీలో లారీలో ఇసుక లోడింగ్ చేసిన తర్వాత లారీపైకి ఎక్కాడు. టార్పాలిన్ వేసే పనికి సోమవారం తోటి కూలీలతో రోజులాగానే వెళ్లాడు. ఎండ తీవ్రత పెరగడంతో చెట్టు నీడకు కుంట్లం-3 క్వారీకి వెళ్లే దారి పక్కన సేదతీరాడు. ఇసుక లోడింగ్ కోసం వచ్చిన లారీ నిద్రిస్తున్న కూలీ తలపైకి ఎక్కింది. దీంతో ఆ కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే లారీ డ్రైవర్ పరారయ్యాడు. మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ అన్నారం ఎంపీటీసీ మంచినీళ్ల దుర్గయ్య మృతుడి కుటుంబానికి రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ లారీలను నిలిపేసి ధర్నాకు దిగారు. దీంతో సీఐ కిరణ్‌కుమార్, కాళేశ్వరం, మహదేవపూర్ ఎస్సైలు లక్ష్మణ్‌రావు, రాజ్‌కుమార్, భవాణిసేన్‌లు తన సిబ్బందితో క్వారీ వద్దకు చేరుకొని ఆందోళన చేస్తున్న వారికి నచ్చచెప్పారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు మృతదేహాన్ని కదలనిచ్చేది లేదని రోడ్డుపై బైఠాయించారు. క్వారీ కాంట్రాక్టర్లు, టీఎస్ఎండీసీ తరుపున మృతుడి కుటుంబానికి రూ. 10 లక్షల సాయం అందిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించినట్లు తెలిసింది. మృతదేహాన్ని మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి భార్య భూదక్క, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.

దర్గాలో సైకో లేడీ అరెస్ట్

కాజీపేట రూరల్ : కాజీపేట 48వ డివిజన్ దర్గా ప్రాంతానికి చెందిన సైకో లేడీని సోమవారం కాజీపేట సీఐ సార్ల రాజు అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..దర్గాలో రోడ్‌నంబర్ 7లో నివాసం ఉంటున్న బానోత్ వనజ గత ఐదేళ్ల నుంచి చుట్టుపక్కల ప్రాంత ప్రజలను తన సైకో వీరంగంతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ తన పెంపుడు కుక్కతో ఇతరులపైకి దాడి చేయిస్తూ పైశాచిక ఆనందం పొందుతోంది. చుట్టుపక్కల వారిని అసభ్య పదజాలంతో దూషించడంతో పాటు, కారంపొడి, కత్తులతో దాడి చేయడం తనకు రోజు పాలు పోస్తున్న పాలవ్యాపారిపై దాడిచేయడం వంటి పనులు చేయడంతో పాటు వారం క్రితం తన ఇంటి ముందు నివాసం ఉంటున్న వ్యక్తిపై కత్తితో దాడి చేయడంతో పలు ఫిర్యాదు అందిన అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు విచారణ అనంతరం సీఐ సైకో వనజను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. సైకోను జైలుకు తరలించడంతో సీఐ, పోలీసులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య

గణపురం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని బస్వరాజుపల్లి గ్రామానికి చెందిన అంబటి రాకేష్(19) ఇంటర్ విద్యార్థి ఇటీవల వచ్చిన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయ్యానని మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గణపురం పోలీసుల కథనం ప్రకారం.. బస్వరాజుపల్లికి చెందిన అంబటి కవిత-కుమారస్వామి దంపతుల కుమారుడు రాకేష్ హనుమకొండలోని ఒక ప్రైవేటు కళాశాలలో చదువుతున్నాడు. ఇటీవల విడుదలైన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన రాకేష్ సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంటర్ విద్యార్థిని..

● చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి



తేజావత్ సింధు

గూడూరు: ఇంటర్ ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో పురుగుల మందుతాగిన విద్యార్థిని చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పొనుగోడుకు చెందిన తేజావత్ పూలు, లీల దంపతుల కూతురు సింధు (17) ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఫెయిల్ అయింది. దీంతో మనస్తాపానికి గురైన సింధు మంగళవారం ఇంట్లో పురుగుల మందు తాగి పడుకుంది. తెల్లవారిన తర్వాత ఇబ్బంది పడిన సింధు తాను పురుగుల మందు తాగినట్లు తల్లిదండ్రులకు చెప్పగా గూడూరు ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించి మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు.. తర్వాత హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సింధు మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వల్మిడిలో మతిస్థిమితం లేని యువకుడు..

పాలకుర్తి టౌన్: మండలంలోని వల్మిడిలో మతిస్థిమితం లేని యువకుడు కుటికంటి జంపన్న(28) ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు కథనం ప్రకారం వల్మిడికి చెందిన కుటికంటి ఎల్లగౌడ్, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు మతిస్థిమితం కోల్పోయి బాధపడుతున్నాడని తెలిపారు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో జంపన్న ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. మృతుడి తండ్రి ఎల్లగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తాళ్ల శ్రీకాంత్ తెలిపారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌పై అట్రాసిటీ కేసు

ఎంజీఎం : వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. ఎంజీఎం ఆస్పత్రిలో కాసు రాములు(46) శనివారం మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని ఆరోపిస్తూ గిరిజన సంఘాలు నేతలు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో సూపరింటెండెంట్‌తో చర్చలు జరిపే క్రమంలో గిరిజన నాయకుడు గుగులోతు తిరుపతి మధ్య వాగ్వాదం జరిగింది. గతంలో ఇదే ఆస్పత్రిలో తమ మేనల్లుడు ఇంజక్షన్ వికటించి మృతి చెందాడని తిరుపతి గుర్తు చేయగా.. 'ఈ లంబాడా కమ్యూనిటీకి వేరే పని ఉండదు.. వీరి మాటలను నమ్మకూడదు' అంటూ కించపరిచాడని పేర్కొంటూ అతను మట్టెవాడ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. తనను దూషించిన సమయంలో రాజు, విజయ్ అనే వ్యక్తులు కూడా ఉన్నట్లు తిరుపతి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గిరిజన సంఘాల నేతలపై కేసు..

ఇదిలా ఉండగా.. కాసు రాములు మృతి ఘటన విషయంలో అతడికి సంబంధం లేని గుర్తు తెలియని వ్యక్తులు మార్చురీ నుంచి మృతదేహాన్ని ఆస్పత్రి క్యాజువాలిటీ వద్దకు తీసుకొచ్చి ఆర్ఎంఓ, సీఎంఓలను దూషించినట్లు సూపరింటెండెంట్ మట్టెవాడ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆజ్మీరా వెంకట్, విజయ్, తిరుపతితో పాటు మరికొందరు సీఎం గదిలోకి ప్రవేశించి సూపరింటెండెంట్‌తో పాటు ఆర్థోపెడిక్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లపై దాడికి దిగే ప్రయత్నం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సుమారు రెండు గంటల పాటు వైద్యులంతా పోలీసుల సహాయంతో సీఎంఓ గదిలో ఉండాల్సిన వచ్చిందని తెలిపారు. వైద్యుల విధులకు ఆటంకం కలిగించారని సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకట్, విజయ్, తిరుపతిపై మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు.


మొక్కజొన్న పంట దగ్ధం



కాలిపోయిన మొక్కజొన్న కంకులను చూపిస్తున్న రైతులు

రాయపర్తి: షార్ట్‌సర్క్యూట్‌తో ఇద్దరు రైతులకు చెందిన మొక్కజొన్న పంటలు అగ్నికి ఆహుతైన సంఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని గణేష్‌కుంట తండాలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గణేష్‌కుంట తండాకు చెందిన మూనావత్ దేవేందర్ రెండెకరాలు, మూనావత్ బోజ్యా రెండెకరాల్లో మొక్కజొన్న పంటలను సాగుచేశారు. మొక్కజొన్న పంటలో నుంచి తీసిన విద్యుత్‌లైనునుంచి ఒక్కసారిగా మిరుగులు పడి మంటలు వచ్చి నాలుగు ఎకరాల్లో సాగుచేసిన మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైంది. పంటను చేతికొచ్చిందని కోసే ప్రయత్నం చేస్తుండగానే షార్ట్ సర్క్యూట్ తమ పాలిట శాపమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మంటలు చెలరేగి మిగతా పంటలు నిప్పంటుకోవడంతో గమనించిన తండావాసులు రోటోవేటర్‌తో మంటలను ఆర్పినట్లు తండావాసులు తెలిపారు. రూ.3 నుంచి 4 లక్షల వరకు నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి



రాంసింగ్ (ఫైల్)

రాజాపేట : విద్యుదాఘాతంతో ఓ లైన్‌మెన్ మృతిచెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని రేణికుంట గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు, విద్యుత్ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్లలోడుతో వస్తున్న లారీ రేణికుంట గ్రామం కొత్తకాలనీలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు చెలరేగాయి. దీంతో గ్రామస్తులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో లైన్‌మెన్ గుగులోతు రామ్‌సింగ్ (48) సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తీగలు సరిచేసేందుకు ఎల్సీ తీసుకున్నాడు. తీగలను సరిచేసి ఎల్సీ రిటర్న్ చేశాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ పోల్‌పై మంటలు రావడంతో తిరిగి ఎల్సీ తీసుకుని దానిని ఎక్కాడు. ఆ స్తంభానికి పైభాగంలో ఉన్న మరో లైన్‌కు విద్యుత్ సరఫరా అవుతున్న సంగతి రాంమ్‌సింగ్ గమనించలేదు. అతను ఆ తీగలకు తగలడంతో వెంటనే విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు సబ్‌స్టేషన్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. రాంమ్‌సింగ్‌ను కిందికి దించి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం రామ్‌సింగ్ మృతదేహాన్ని ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రామ్‌సింగ్ స్వగ్రామం దేవరుప్పల మండలంలోని పడమటి తండా. ఇతడికి భార్య మంగమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విద్యుత్ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్



మహేందర్ (ఫైల్)

నర్సంపేట రూరల్/చెన్నారావుపేట : ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలోని గురిజాలలో సోమవారం చోటుచేసుకుందని ఏఎస్సై లక్ష్మణమూర్తి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గురిజాలకు చెందిన పెండ్యాల రమ-సంపత్ దంపతుల కుమారుడు మహేందర్ (23) అదే గ్రామానికి చెందిన బండారి రమేష్ వద్ద డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గ్రామ శివారులోని పెద్దం చెరువులో ఉపాధి హామీ పనులు నడుస్తున్నాయి. చెరువు మట్టిని తీసుకొని వెళ్తుండగా ప్రమాదవశాత్తు బండరాయిని తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా కొట్టడంతో డబ్బాతో సహా కిందపడిపోయింది. డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికులు గమనించి 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

స్థల వివాదంపై మహిళ ఆత్మహత్యాయత్నం

● పోలీసులు కొట్టారని బాధితురాలి కుమారుడి ఆరోపణ



చికిత్స పొందుతున్న ముత్తమ్మ

మహబూబాబాద్ రూరల్ : జిల్లా కేంద్రంలోని ఓ ఇంటి స్థల వివాదం విషయంలో ఓ మహిళ పురుగుల మందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థల వివాద విషయంలో తన తండ్రిని కొట్టారని బాధితురాలి కుమారుడు ఆరోపించారు. బాధితురాలి కుమారుడు నాగరాజు కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని బేతోలుకు చెందిన మీసాల ముత్తమ్మ-రాములు దంపతులు 2015లో మారంరాజు నారాయణరావు, బోయినపల్లి శ్రీకాంత్ వద్ద జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రి పక్కన 100 గజాల ఖాళీ స్థలాన్ని రూ.12 లక్షలకు కొనుగోలు చేశారు. బయానా కింద యజమానికి రూ. 32 వేలు ఇచ్చారు. 2019లో గెట్టుపెట్టి అగ్రిమెంట్ రాసుకునే సమయంలో కురవి మండలం కాంపల్లి శివారు బీల్యానాయక్ తండాకు చెందిన కేలోత్ బిక్కు సాక్షిగా ఉన్నాడు. అప్పటి నుంచి ఆ దంపతులు ఆ స్థలంలోనే రేకుల షెడ్డు వేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. ఆ దంపతులకు తెలియకుండా కేలోత్ బిక్కు భార్య జ్యోతి పేరు మీద ఆ స్థలం రిజిస్ట్రేషన్ చేశారని తెలిసింది. 2021 నుంచి బిక్కు ఆ స్థలం నాదే అనడంతో బిక్కుకు, ముత్తమ్మ దంపతులకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. నాలుగు నెలల క్రితం రాములు-ముత్తమ్మ నిద్రిస్తున్న సమయంలో బిక్కు పెట్రోల్ పోసి రేకుల షెడ్డును తగలబెట్టారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి దరఖాస్తు ఇవ్వగా పోలీసులు విచారణ జరిపి బిక్కుపై కేసు నమోదు చేశారు. మే 3న బిక్కు జ్యోతి వారి కుమారుడు ముత్తమ్మ-రాములుతో గొడవపడి గొడ్డలి, కత్తులతో దాడి చేసి హత్యాయత్నం చేయగా వారు తప్పించుకున్నారు. జరిగిన విషయంపై పోలీసుల దృష్టికి తీసుకెళ్ళడం కోసం టౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి దరఖాస్తు ఇవ్వడానికిపోతే టౌన్ సీఐ సతీష్ దరఖాస్తు తీసుకోకుండా నాగరాజును పిలిచి అసభ్యకర పదజాలంతో దూషించారు. జరిగిన సంఘటనలపై విచారణ జరిపించి తమకు న్యాయం చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవా లని ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. సోమవారం మధ్యాహ్నం టౌన్ ఎస్సై విజయ్‌రాంకుమార్, కానిస్టేబుళ్లు ముత్తమ్మ ఇంటి వద్దకు స్థలం అమ్మిన యజమాని శ్రీకాంత్‌ను తీసుకెళ్లారు. ఇరువర్గాల వాదనలు నడుస్తూ పోలీసులు మాట్లాడుతుండగానే ముత్తమ్మ ఇంట్లోకి వెళ్లి పురుగుల మందుతాగి కిందపడిపోయింది. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ వై.సతీష్‌ను వివరణ కోరగా ఇంటి స్థలం వివాదం విషయంలో ముత్తమ్మ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణలో భాగంగా ఆమెను పీఎస్‌కు రమ్మని చెప్పాం. ఆమె రాకపోవడంతో టౌన్ ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్ళు సంఘటన స్థలానికి యజమానిని తీసుకుని వెళ్లి మాట్లాడారు. అంతలోనే ఆమె పురుగుల మందు తాగగా పోలీసులు ఆమెను ఆటోలో ఆస్పత్రికి తరలించారు.